తలకు తగిలే గాయాలను నిర్లక్ష్యం చేయొద్దు

న్యూరో సర్జన్ డాక్టర్ శ్రీనివాస్

విశ్వంభర, శంషాబాద్: తలకు తగిలే గాయాలను నిర్లక్ష్యం చేయడం ప్రమాదమని డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. మలక్ పెట్ యశోద ఆసుపత్రి బృందం అత్యవసర మెదడు శస్త్రచికిత్సతో తలకు తీవ్రమైన గాయం అయిన 12 ఏళ్ల బాలుడికి ప్రాణదానం చేశారు. ఈ సందర్భంగా శంషాబాద్ జోన్ కేంద్రంలోని ఎలైట్ హోటల్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ... హైదరాబాద్ లో ఓ పాఠశాలలో చదువుతున్న విద్యార్థి శంషాబాద్ కి చెందిన ఓ బాలుడు గత కొన్ని రోజుల క్రితం మెట్ల మీదినుండి జారి పడిపోవడంతో తీవ్రమై ట్రామాటిక్ బ్రెయిన్ ఇంజరీకి గురైయ్యాడు. సమయానికి న్యూరోసర్జికల్ జోక్యం,ఆధునిక న్యూరో క్రిటికల్ కేర్ ద్వారా వైద్యులు బాలుడిని రక్షించారని తెలిపారు. పెద్ద ఎపిడ్యూరల్ హీమరేజ్, తల ఎముక విరుగుడు కారణంగా జరిగే తలకు గాయాలు మెదడులో ఒత్తిడి పెరగడం, మెదడు నలిగిపోవడం వల్ల చాలా త్వరగా ప్రాణాపాయ స్థితికి దారితీస్తాయి అని చెప్పారు.ఇటువంటి పరిస్థితుల్లో శాశ్వత నరాల నష్టం నివారించేందుకు తక్షణ నిర్ధారణ, అత్యవసర శస్త్రచికిత్స మరియు గాఢ న్యూరో క్రిటికల్ కేర్ అవసరం అవుతుందని చెప్పారు.. వైద్యులు చేసిన సమగ్ర పరీక్షల్లో ఎడమ టెంపరల్ ప్రాంతంలో పెద్ద ఎపిడ్యూరల్ హీమరేజ్ ఉండి, మెదడు మధ్యరేఖ తారుమారైనట్లు గుర్తించారు. పరిస్థితి ప్రాణాపాయంగా మారే అవకాశం ఉండటంతో న్యూరోసర్జరీ బృందం అత్యవసర క్రానియోటమీ చేసి రక్త గడ్డను విజయవంతంగా తొలగించి బాలుడి పరిస్థితిని స్థిరపరిచిందని చెప్పారు. బాలుడు దాదాపుగా స్పృహ కోల్పోయే పరిస్థితిలో ఉన్నాడు. పరీక్షలో ఎడమ పారియేటల్ ప్రాంతంలో వాపు కనిపించడంతో పాటు ఎడమ కంటిలో ఆర్బిటల్ హీమటోమా ఉన్నట్టు గుర్తించారు. పై కంటి పాప పడిపోవడం , కంటి కదలికలు పరిమితంగా ఉన్నట్లు గుర్తించారు. వెంటనే న్యూరోలాజికల్ పరీక్షలు , రేడియాలజీ పరీక్షలు నిర్వహించారు. సీటీ స్కాన్లో ఎడమ టెంపరల్ ప్రాంతంలో గరిష్టంగా 24 మిల్లీమీటర్ల మందంతో పెద్ద ఎపిడ్యూరల్ హీమరేజ్ ఉండటం, ఎడమ టెంపరల్ ఎముక విరగడం,మెదడు మధ్యరేఖ కుడి వైపు 7 మిల్లీమీటర్ల మేరకు మారినట్లు గుర్తించారు. డాక్టర్లు పరీక్షలు చేస్తుండగానే బాలుడు కోమాలోకి వెళ్లిపోయాడు. అతని న్యూరోలాజికల్ పరిస్థితి క్షీణించే ప్రమాదం ఉండటంతో అత్యవసర శస్త్రచికిత్స చేయాలని నిర్ణయించారు. సాధారణ అనస్థీషియాలో అత్యవసరంగా ఎడమ ఫ్రాంటో-టెంపోరో-పారియేటల్ క్రానియోటమీ చేసి ఎడమ టెంపరల్ ఎపిడ్యూరల్ హీమటోమాను తొలగించారు. అలాగే రక్తస్రావం అవుతున్న రక్తనాళాన్ని సరిచేసి రక్తస్రావాన్ని ఆపారు. అనంతరం తల ఎముకను టైటానియం ప్లేట్లు, స్క్రూలతో తిరిగి అమర్చారు. ఈ శస్త్రచికిత్సను, సీనియర్ కన్సల్టెంట్ న్యూరోసర్జన్ అనస్థీషియా బృందంతో కలిసి నిర్వహించానని డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. శస్త్రచికిత్స అనంతరం రోగిని న్యూరో ఐసీయూకి తరలించి ప్రత్యేక పర్యవేక్షణలో ఉంచారు.శస్త్రచికిత్స తర్వాత బాలుడికి వెంటిలేటర్ సహాయం అందించారు. న్యూరో ఐసీయూలో నిశితంగా పర్యవేక్షించారు. మొదటి శస్త్రచికిత్స అనంతర రోజున విజయవంతంగా వెంటిలేటర్ తొలగించారు, క్రమంగా న్యూరోలాజికల్ పరిస్థితి మెరుగుపడింది.

గ్రామాభివృద్ధికి నిధులు

విశ్వంభర, సిద్దిపేట: గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం రూ.60లక్షల నిధులు మంజూరు చేసిందని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్ఛార్జి పూజల హరికృష్ణ తెలిపారు. సిద్దిపేట రూరల్ మండలంలోని బచ్చాయిపల్లి, సీతారాంపల్లి గ్రామాల్లో పలు అభివృద్ధి పనులను గ్రామ నాయకులతో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పూజల మాట్లాడుతూ, మంత్రి వివేక్ వెంకటస్వామి సహకారంతో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో బచ్చాయిపల్లి నూతన గ్రామ పంచాయతీ భవనానికి రూ.20లక్షలు, డ్రైనేజీ నిర్మాణానికి రూ.30లక్షలు, సీతారాంపల్లి సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.10లక్షల నిధులతో నిర్మాణాలకు భూమి పూజ చేసినట్టు చెప్పారు. భవిష్యత్లో గ్రామాల మౌలిక వసతులకు మరిన్ని నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ దుర్గం ప్రేమలత యాదగిరి, ఉప సర్పంచ్ అనుపమ, మండల నాయకుడు గుర్రం అంజిరెడ్డి, అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి బండి శివకుమార్, దేవిరెడ్డి రాజారెడ్డి, బాబురెడ్డి, అంజిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు రాజ బహదూర్ రెడ్డి, అరవింద్ తదితరుల పాల్గొన్నారు.

పందెం కోడి విరిగిన రెక్కకు శస్త్ర చికిత్స

విశ్వంభర, కోదాడ: మేళ్లచెర్వు మండల కేంద్రానికి చెందిన పందెం కోడి యజమాని మొన్న తన కోడి పుంజును బరిలో దింపగా అవతలి కోడిపుంజు విసిరిన కత్తి దెబ్బకి కోడి పుంజు భుజం ఎముక (రెక్క ఎముక) తెగి రెండుగా విడిపోయింది . అసలే కోళ్ళంటే పిచ్చి, అందులోనూ పౌరుషాలకు ప్రతిరూపమైన పందెం కోడి అంటే మహాపిచ్చితో కోడి పుంజును ఎలాగైనా కాపాడుకోవాలనే తపనతో వైద్యంకోసం నిన్న మేళ్లచెర్వు వెళ్లగా కోడిపుంజును కోదాడ తీసుకువెళ్లాలని అక్కడి సిబ్బంది సూచించారు. కోసుకొని తినే కోడే కదా అన్న చిన్న చూపు లేకుండా తనకు నచ్చిన ప్రాణానికి ఎలాగైనా తిరిగి రెక్కను అందించాలనే పెద్ద మనస్తో యజమాని కోడిపుంజుని కోదాడ పట్టణం ప్రాంతీయ పశు వైద్యశాలకు తీసుకు వచ్చారు. రెక్క విరిగిన కోడి పుంజును పరీక్షించిన అసిస్టెంట్ డైరెక్టర్ డా పి పెంటయ్య, బొక్క విరిగి రెండు రోజులు కావడం తో తెగిన కండ, బొక్కలు ఇన్ఫెక్షన్ సోకి ఉండగా , గాయాలను శుభ్రపరచి రక్త ప్రసరణ జరిగేలా చేసి ఆర్థోపెడిక్ సర్జరీ ద్వారా విరిగిన ఎముకలను రాడ్ వేసి అతికించి, గాయాన్ని కుట్లతో మూసి వేసి విజయవంతంగా శస్త్ర చికిత్స పూర్తిచేశారు. అనంతరం అంతవరకూ రెక్క వేలాడేసి తిరిగిన కోడి రాడ్ వేశాక రెక్కను ఆడిస్తూ నిటారుగా లేచి తిరగడం తో యజమాని సంతోషం వ్యక్తం చేశారు. చికిత్సలో సిబ్బంది రాజు, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

20న కామ్రేడ్ ఠానూ నాయక్ వర్ధంతి

విశ్వంభర, బాగ్ లింగంపల్లి: హైదరాబాదు బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 20న కామ్రేడ్ ఠానూ నాయక్ 77వ వర్ధంతి సభలు జరగనున్నాయి. తెలంగాణ గిరిజన సంఘం, సుందరయ్య విజ్ఞాన కేంద్రం, తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం రాష్ట్ర నాయకులు మంగళవారం వర్ధంతి పోస్టర్‌ను విడుదల చేశారు. తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్ష ఎం ధర్మ నాయక్, ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీరాం నాయక్, సుందరయ్య విజ్ఞాన కేంద్రం కార్యదర్శి ఎస్ వినయ్ కుమార్, తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం నాయకులు భూపతి వెంకటేశ్వర్లు కార్యక్రమంలో పాల్గొన్నారు. 1950 మార్చి 20న భూమి, భుక్తి, వెట్టి చాకిరీ విముక్తి కోసం జరిగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో వీరమరణం పొందిన ఠానూ నాయక్ చరిత్రను భావితరాలకు తెలియజేయడం ఈ సభ ఉద్దేశ్యం. హైదరాబాదులో మూడు సంఘాల ఆధ్వర్యంలో జరుగుతున్న సభకు రాష్ట్ర గిరిజన సంఘాలు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొంటారు. కార్యక్రమంలో తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం బాలు నాయక్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లా నాయకులు ఎం గోపీ నాయక్, రఘు నాయక్, శివ ప్రచండ నాయక్ పాల్గొన్నారు.

పుల్లూరులో ఆరోగ్య శిబిరం

విశ్వంభర, సిద్దిపేట: ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా రూరల్ మండలం పుల్లూరు గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్పెషాలిటీ డాక్టర్లచే మంగళవారం ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 6రకాలైన జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్, స్త్రీ వైద్య, కంటి వైద్య, దంత, పిల్లల డాక్టర్లు రోగులను పరీక్షించారు. పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ రాజేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరానికి గ్రామస్తులు భారీగా హాజరై వైద్య సేవలను వినియోగించుకున్నారు. వైద్య శిబిరాన్ని డీఎంహెచ్‌వో డాక్టర్ ధన్‌రాజ్ ఆకస్మాత్తుగా తనిఖీచేసి వైద్య సేవలను పర్యవేక్షించారు. ప్రోగ్రాం ఆఫీసర్ ఎన్సీడీ డాక్టర్ వినోద్ బాబ్జీ బీపీ, షుగర్ రోగులకు అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంత్ లత, సీహెచ్‌వో లక్ష్మి, సూపర్‌వైజర్ శాంత, పీహెచ్ఎన్ ప్రభలత, సీనియర్ అసిస్టెంట్ సాధిక్, పీహెచ్‌సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

విశ్వంభర, మహబూబాబాద్: మంగళవారం జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మహబూబాబాద్ పట్టణంలోని జిల్లా ప్రభుత్వ ప్రధాన జనరల్ హాస్పిటల్ లో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ హాస్పిటల్ లోని ఓపి వార్డు, ఏఎంసీ, ఐసీయూ, పిడియాట్రీషియన్, ఎస్ఎన్సియు, జనరల్ మెడికల్ వార్డు, ఆలనా సెంటర్, ప్రతి వార్డులు తిరుగుతూ వైద్యం కోసం వచ్చిన పేషెంట్లు, వారి బంధువులతో స్వయంగా మాట్లాడారు. హాస్పిటల్ లో అందిస్తున్న సేవలు, ఆహారం తదితర అంశాలపై ఆరా తీశారు, హాస్పిటల్ లోని సిబ్బంది హాజరు పట్టిక, స్టోర్ స్టాక్ రిజిస్టర్, ఇన్ పేషెంట్, ఔట్ పేషెంట్ రిజిస్టర్లు, డ్యూటీ ఆర్డర్స్, రిజిస్టర్, వైద్య పరీక్షలు నిర్వహించే ఇండెంట్ రిజిస్టర్, బయోమెట్రిక్ రిజిస్టర్, మెడిసిన్ స్టాక్ రిజిస్టర్ లను ఉదయం నుండి మధ్యాహ్నం వరకు సుదీర్ఘ సమయం హాస్పిటల్, వార్డులు, పరిసరాలను స్వయంగా పరిశీలించారు. వివిధ ఆరోగ్య సమస్యల వైద్యం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి నిరుపేద సామాన్య ప్రజలు తదితరులు వైద్యం కోసం రావడం జరుగుతుందని, ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అత్యాధునిక పరికరాలతో వైద్య విధాన సేవలు, టెస్టులు , ప్రతి ఒక్కరికి అందాలనే ఉద్దేశంతో నాణ్యమైన, వేగమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. హాస్పటల్ వైద్య సిబ్బంది ప్రతి ఒక్కరూ కచ్చితంగా సమయపాలన పాటించాలని, వారికి కేటాయించిన సమయాలలో వైద్య సేవలు అందించడం కోసం సిద్ధంగా ఉండాలని, అత్యవసర పరిస్థితులలో ప్రతి ఒక్కరూ అందుబాటులో ఉంటూ ప్రజలకు వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. హాస్పిటల్ లో పేషెంట్లకు వారి సహాయకులకు ఏలాంటి ఇబ్బందులు లేకుండా సెక్యూరిటీని ఏర్పాటు చేసి సీసీ కెమెరాలను నిత్యం పరిశీలిస్తూ ఉండాలన్నారు. ఆస్పత్రికి వచ్చే పేషెంట్లు వారి బంధువులతో వైద్య సిబ్బంది సేవ భావంతో ఉండాలని కలెక్టర్ సూచించారు. ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో కూడా వైద్య సేవల నిమిత్తం ప్రత్యేక క్యాంపులు నిర్వహించి పేదలకు వైద్య సేవలు అందించడం జరుగుతుందని అన్నారు. కలెక్టర్ వెంట హాస్పిటల్ సూపర్డెంట్ డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ వెంకట్ లకావత్, డాక్టర్ జగదీష్, డాక్టర్ హర్షవర్ధన్, తదితరులు ఉన్నారు.

మెడికల్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలి

ప్రభుత్వ హాస్పిటల్ లలో సాధారణ ప్రసవాలు పెంచాలి

జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

విశ్వంభర, సూర్యాపేట: ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా వైద్య నిపుణులచే ప్రతి పి హెచ్ సి లో మెడికల్ క్యాంప్ లు నిర్వహించడం జరుగుతుందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ కోరారు. దీనిలో భాగంగా మంగళవారం మేళ్ల చెర్వు పి హెచ్ సి లో నిర్వహిస్తున్న మెడికల్ క్యాంప్ ను ఆయన మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ మెడికల్ క్యాంప్ ల ద్వారా జనరల్ మెడిసిన్, పిడియాట్రిక్, గైనకాలజీ, ఆర్థోపెడిక్, ఆప్తమాలజీ, మహిళలకు గర్భశాయ ముఖ కాన్సర్ ను గుర్తించే టాప్ స్పెయర్, కంటికి సంబందించి కాంట్రాక్ట్ లోపం,బి పి షుగర్, చిన్న పిల్లలో ఎత్తు, పోషకాహార లోపాలకు చెందిన వైద్య నిపుణులు రోజుకొక్క పి హెచ్ సి కి వచ్చి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను ఉచితంగా అందించటం తో పాటు ఆరోగ్యం మెరుగు పడేలా పలు సూచనలు ఇస్తారని ఇంకా ఏమైనా శస్త్ర చికిత్స లు చేయాల్సివచ్చిన, మెరుగైన వైద్యం కోసం జనరల్ హాస్పిటల్ కి రిఫర్ చేయటం జరుగుతుందని అన్నారు. పిహెచ్ సి లలో సాధారణ ప్రసవాలు పెరిగేలా ప్రజలను ఆహగాహన కల్పించాలని వైద్య సిబ్బందికి సూచించారు. అనంతరం మేళ్లచెర్వు మండల కేంద్రం లోని ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ స్కూల్ లో కలెక్టర్ హాస్టల్ లోని గదులను వంట గదిని పరిశీలించి, విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం భోజనం చేశారు. విద్యార్థులను ప్రతి రోజు వంట బాగుంటుందా మెను ప్రతిరోజు అమలు చేస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం జరుగుతున్న పదవతరగతి వార్షిక పరీక్షలలో ప్రతి విద్యార్థి ప్రతి సబ్జెక్ట్ లో కనీసం 70 శాతానికి పైగా మార్కులు సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకొనిరావాలని కోరారు. కలెక్టర్ వెంట డిప్యుటీ డిఎంహెచ్ఓ మాధవ్ కుమార్, డాక్టర్ సుధాకర్ నాయక్, వైద్యులు యస్వంత్, మణి, ప్రజ్ఞ, సాయి శ్రీ, వెంకటేష్, సమీర, మెడికల్ అధికారి, వైస్ ప్రిన్సిపాల్ మధు, ఇన్చార్జి తహసిల్దార్ సురేందర్ రెడ్డి, సర్పంచ్ బచ్చు పద్మావతి, ఉప సర్పంచ్, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

మూసీ ప్రక్షాళన చేయాలి

విశ్వంభర, హైదరాబాదు : గత 12 ఏళ్లుగా మూసి నదిలో అభివృద్ధి జరగలేదు, మురుగు కాలుష్యం తగ్గకపోగా మరింత పెరిగింది, వెంటనే ప్రక్షాళన చేపట్టి, బఫర్ జోన్ పేరుతో ఇళ్ల తొలగింపులు ఆపాలి అని హైదరాబాద్ సిటిజన్ ఫోరం, అర్బన్ డెవలప్‌మెంట్ ఫోరం ప్రతినిధులు డిమాండ్ చేశారు. హైదరాబాదు బాగ్ లింగంపల్లి లోని హెచ్‌సిఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఈ అంశాలను వెల్లడించారు. మూసి అభివృద్ధి పేరుతో కేటాయించిన నిధులు సక్రమంగా వినియోగించలేదని తెలిపారు. పలు సంవత్సరాల్లో నిధులు కేటాయించినప్పటికీ ఖర్చు చాలా తక్కువగా ఉందని పేర్కొన్నారు. మూసి అభివృద్ధి ప్రాజెక్టులో భాగంగా ఇరువైపులా 50 మీటర్ల బఫర్ జోన్ పేరుతో భారీగా ఇళ్ల తొలగింపులు చేయడం అన్యాయమన్నారు. నది ప్రవాహానికి ఆటంకంగా ఉన్న ఇళ్లను మాత్రమే తొలగించి, బాధితులకు ప్రత్యామ్నాయ నివాసాలు కల్పించాలని సూచించారు. ఈ విషయంలో ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదని విమర్శించారు. మునుపటి ప్రణాళికల్లో ఇళ్ల తొలగింపుకు ప్రత్యామ్నాయంగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇవ్వాలని ప్రతిపాదించిన విషయాన్ని గుర్తు చేశారు. మూసి పరిసర బస్తీలు, కాలనీల ప్రజలతో చర్చించి ప్రణాళికలో మార్పులు చేసి అమలు చేయాలని కోరారు. ఈ సమావేశంలో యుడిఎఫ్ కన్వీనర్ ఎం. శ్రీనివాస్, హెచ్‌సిఎఫ్ అధ్యక్షుడు ఎం. శ్రీనివాస్‌రావు, ప్రధాన కార్యదర్శి వీరయ్య, ఉపాధ్యక్షుడు పి. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పీస్ కమిటీ సమావేశం

విశ్వంభర, రామన్నపేట: యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండల కేంద్రంలో మంగళవారం యదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీ ఆకాంక్ష్ యాదవ్ ఆదేశానుసారం రంజాన్ పండుగ సందర్భంగా మండల పోలీసు స్టేషన్లో పీస్ కమిటి మీటింగ్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో రామన్నపేట మండల ఎస్సై డి.నాగరాజు మాట్లాడుతూ, రంజాన్ పండుగను స్నేహభావంతో, కులమత భేదం లేకుండా జరుపుకోవాలని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పండుగను చేసుకోవాలని కమిటి సభ్యలను కోరారు. అదేవిదంగా రంజాన్ పండుగ తరువాత వచ్చే ఉగాది, శ్రీరామనవమి పండుగలను కూడా కులాలకు అతీతంగా అందరు కలిసి జరుపుకోవాలని కోరినారు. ఈ కార్యక్రమంలో రామన్నపేట గ్రామ సర్పంచ్ గరిక సత్యనారాయణ, ఉప-సర్పంచ్ రమేష్, ఇతర నాయకులు ఎండి.అన్వర్, ఇతర సభ్యులు, పోలిస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సామేల్ పై చర్యలు తీసుకోవాలి

విశ్వంభర, హైదరాబాదు : తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ చేసిన వ్యాఖ్యలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర ధర్మాచార్య ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి డిమాండ్ చేశారు. ఈ మేరకు విహెచ్‌పీ ప్రతినిధులు తెలంగాణ డిజిపికి వినతిపత్రం సమర్పించారు. బాలస్వామి మాట్లాడుతూ, ప్రజాప్రతినిధులు సమాజంలో శాంతి, సామరస్యాలను కాపాడాల్సిన బాధ్యత ఉందన్నారు. ఎమ్మెల్యే వ్యాఖ్యలు హిందూ సమాజాన్ని కించపరిచేలా, కులాల మధ్య విభేదాలు రగిలించేలా ఉన్నాయని ఆక్షేపించారు. సంబంధిత అంశాలపై సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే సభ్యత్వం రద్దు ప్రక్రియ ప్రారంభించాలని కోరారు. చర్యలు లేకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మోహన్ రావు, హరికిషన్ శర్మ, అనిల్, ధీరజ్, రంగనాథ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

హాస్పిటల్ ను తనిఖీ చేసిన జిల్లా వైద్యాధికారి

విశ్వంభర, మహబూబాబాద్ : మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పట్టణంలోని విజయ లక్ష్మి హాస్పిటల్‌ను జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రవి రాథోడ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇటీవల ఆసుపత్రి సంబంధిత వైద్యుడిపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో విచారణ నిమిత్తం ఈ తనిఖీ చేపట్టారు. అయితే, తనిఖీకి వెళ్లిన సమయంలో ఆసుపత్రి మూసివేసి ఉండడం గమనార్హం. ఈ సందర్భంగా అక్కడ సంబంధిత సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి మాట్లాడుతూ, ఆసుపత్రుల నిర్వహణలో నిర్లక్ష్యం, నియమ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడం అస్సలు సహించబడదని స్పష్టం చేశారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాల్సిన బాధ్యత ప్రతి ఆసుపత్రి యాజమాన్యం మరియు సిబ్బందిపై ఉందని తెలిపారు. ఈ సంఘటనపై పూర్తిస్థాయి నివేదికను సిద్ధం చేసి, తదుపరి చర్యలు తీసుకోబడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మాస్ మీడియా అధికారి కొప్పు ప్రసాద్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలను సందర్శించిన ఎంపీడీవో

విశ్వంభర, వలిగొండ: యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి. జలందర్ రెడ్డి, నాథళ్లగూడెం గ్రామాన్ని సందర్శించారు. సర్పంచ్ మోటే జంగమ్మ , గ్రామ కార్యదర్శి కూడా పాల్గొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసిన హాజరు రిజిస్టర్‌ను పరిశీలించి, అందుబాటులో ఉన్న సరుకుల నాణ్యత మరియు పరిమాణంపై విచారణ చేశారు. గర్భిణీ స్త్రీలతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితులు, వైద్య సదుపాయాల ను తెలుసుకున్నారు. చిన్నారుల బరువు కొలిచి, వారి ఎత్తుకు అనుగుణంగా ఉండాల్సిన ప్రామాణిక బరువుపై ఆరా తీశారు. గ్రామ నర్సరీని సందర్శించి, అక్కడ ఉన్న మొక్కలు, నాటిన మొక్కల పరిస్థితిని పరిశీలించారు. మొక్కలకు క్రమం తప్పకుండా నీరు పోయడం, సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం ప్రాథమిక పాఠశాలను సందర్శించి, హాజరు రిజిస్టర్‌ను పరిశీలించి, విద్యార్థుల హాజరుపై వివరాలు తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థులకు స్వయంగా ఆహారం వడ్డించారు. గ్రామంలో పర్యటిస్తూ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను కలుసుకుని, ఇళ్ల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.